ప్రచురణకు స్వీకరించిన పోటీ కథానిక

★

# హృదయం మరచిపోయిన రచయిత

హోరున వాన పడుతోంది. గదిలో పుస్తకం చదువుకుంటోంది అనంతలక్ష్మి. 'ఒసేవు అనంతం లేచి, కుంపటి అంటించమ్మా. గొంతుగిలో కాఫీనీళ్లు పడకపోతే నాకు పనితోచదు. అని పురమాయించింది వెంకమ్మగారు ఫలహారానికి మొరుం విసురుకుంటూ.

'నువ్వే లేచి నీళ్లు పడీకూడదూ? అంది అనంతం.

'ఏవిఁ రాయసవేఁ తల్లీ. రేపు మొగుడొస్తే అతనికూడా కాఫీ చుక్కియ్యవా ఏవిఁటి?'

'రేపుకాదు ఇవాళే వచ్చినా ఇవ్వను!'

తలుపు చప్పుడయింది.

ముసలమ్మగారు అదోరకంగా నవ్వుతూ గదిలోకి వొచ్చి 'వచ్చినట్టు ఇస్తావే. వండో నూటయాభయ్యో తెచ్చి చేతిలో పోస్తాడు. ముక్కుమీద గుద్ది చాకిరీ చేయించుకుంటాడు.' అని బుగ్గపొడిచి వంటింట్లోకి పోయింది.

అనంతలక్ష్మికి ఈమధ్య అన్నిటిమీదా చికాకు ఎక్కువయిపోతోంది పెళ్లి ప్రత్నాలు జరుగుతున్నాయి పెళ్లంటే ఆమెకి ఇష్టం లేదనికాదు అది మరీ వ్యాపార సరళిలో ఉండడంతో ఆమె ఊహాలన్నీ చెదరిపోయాయి. అమ్మమ్మ తను పుట్టిన దగ్గరనుండి కూడబెడుతోంది దమ్మిడీ కానీ చొప్పున – ఎప్పటికయినా మనవరాలికి మొగుణ్ణి కొనడం తనకి తప్పనిసరైనట్టు.

మళ్లీ తలుపు చప్పుడయింది.

కోపంగా పుస్తకం మూసి లేచింది అనంతలక్ష్మి.

దూకుడుగా తలుపు తీసింది. కొత్త మనిషిని చూసి శరీరంలో ఓ పావుభాగం తలుపుచాటుకిచ్చింది,

సన్నంగా చక్కని ప్లౌజు పంట్లాంలో తడిసి పోయి నిలబడ్డావొక యువకుడు. 'మీ ఇంట్లో ఓ గది ఖాళీఉందని విన్నాను. అద్దెకిస్తారా?' అని కొంచెం ఒగ్గేడు

అప్పుడే సమాచారం సేకరించుకునే వొచ్చాడన్నమాట. ఈ రకం ముందు జాగర్త అంటేనే కోపం అనంతానికి. 'అలాటి దేం లేదండీ!'

ఆ యువకుడికి అనంతలక్ష్మి కోపం అర్థంకాలేదు. 'సరేలెండి' అంటూ పోబోయేడు.

కాని ముసలమ్మవి పాము చెవులు. 'ఎవరే అది?' అంటూ వొచ్చింది. 'ఎం బాబూ?'

రచన:

**రుద్రభట్ల నరసింగరావు**

'గదేమయినా ఖాళీగా ఉందేమో అని వొచ్చానండి'

'కుటుంబంతో వొచ్చేరా వొంటరిగాళ్ళేనా?'

'ఒక్కణ్ణేనండి.'

'వండు కుంటారా?'

'మరే'

'బావుంది ఇలా వొచ్చి చూసుకోండి బాబూ.' అంటూ దారి చూపిందావిడ.

వెంకమ్మ వెంట ఓ చిన్నకొట్టులోకి వెళ్ళాడు ఆ అబ్బాయి.

మూతి విరిచి తల విసిరింది అనంతలక్ష్మి – జశని పీపుమీదనుంచి వక్షం మీదకి బదిలీచెయ్యగలిగింది అంతే. బదిలీ! మేస్టరుమీద అలిగి ఇన్‌స్పెక్టరు చెయ్యగలిగే పని!

గదిలో పెంకులూ ఇసకా గట్రా ఉన్నాయి.

'ఈగది ఖాళీచేసి అలికేస్తాను. మీ సామాన్లు తెచ్చుకోండి. ఓ మూల కుంపటెట్టుగుని చారెడు బియ్యం పొంగించుకు తిని పోతూ ఉందురుగాని. ఎక్కణ్ణించి బదిలీ అయివొచ్చారు?'

ఏదోవూరు చెప్పేడు అతను.

'అఁ హాఁ ఏదో ఈ ఇంటికి మొగదిక్కు లేదుబాబూ. ఇదుగో మా మనవడు, పీడే ఈ ఇంటికి పెద్ద. అమ్మా బాబూ బావున్నారా?'

'తల్లి చిన్నపుడే పోయిందండి. నాన్నగారు మొన్న మొన్ననే–'

'పాపం!'

గది చాలా ఇరుగ్గా ఉంది. కిటికీ ఓకంతలా ఉంది. వెంకమ్మగారు ఇదివరలో ఆ గదిలో ఎవరెవరు ఎంత మంచిగా కాలక్షేపం చేసి వెళ్ళిందీ వర్ణించి చెప్పింది.

అతనూ అలా వెళ్ళగానే వొంటింట్లోకి పరిగెట్టుకొచ్చింది. నీళ్లుడికిపోతున్నాయి చాలా సేపాయె.

"ఎప్పుడూ అలా పుస్తకం మొహంమీద పెట్టుకూచోపోతే ఈ నీళ్ళలో కాస్త గుండ తగలెట్టి దింపకూడదుటే? ఇంత సేపూ బొగ్గులు ఉట్టినే మండేయి. నేనిలా కొంపద్దెకిచ్చుకునీ, నీళ్లుమోసీ, పాలుమోసీ ఛావవస్తాఁ–'

పుస్తకం మూస్తూ 'నిన్నెవరు పడమన్నారమ్మమ్మా ఈబాధంతా. హాయిగా రామా కృష్ణా అంటూ కూచోక?' అంది అనంతలక్ష్మి.

'నువ్వో ఆడగుంటకి పెళ్ళి చెయ్యవలసొచ్చినపుడు తెలుస్తుంది తల్లీ ఎవరు పడమనేదీనూ,' అంది వెంకమ్మ డికాక్షన్ వడబోసిన గుడ్డని కసిగా పిండుతూ.

అమ్మమ్మల బాధల్ని అమ్మాయిలు అర్థంచేసుకోగలరా?

మర్నాడు సామానుతో సిద్ధమయ్యేడు ఆ యువకుడు. అంతా కలిసి ఓ అట్ట పెట్టె అంతే.

'మనింటి పేరేమిటి బాబూ.' అనడిగింది వెంకమ్మగారు.

చెప్పేడు ఆ అబ్బాయి కొంచెంనవ్వుకుంటూ. ఈముసలాళ్లందరికీ తన ఇంటి పేరే కావాలి. పేరక్కర్లేదు.

'ఇంకేం, మనమంతా ఓ శాఖవాళ్ళమే. ఈపూటకిహ వొండుకోకండి. ఏదో మాతో పాటే గుప్పెడు మెతుకులుతిని రేపట్నించి మీపాట్లు మీరు పడుదురుగాని.'

అతను కొంచెం ఆశ్చర్యంగా చూశాడు. ఆవిడ వైపు - తను గుప్పెడు మెతుకులే తినగలడని ఎలా తెలుసుకుందా అని కాబోలు!

కోపగించిన కోమలాంగికోసం వెతికాయి అతని కళ్ళు - వృధాగా.

అతని పేరు లలితానంద స్వరూప్ ట.

ముసిలావిడ విడ్డూరంగా ముక్కు మీద వేలేసుకోగా గదిలో ముదిత 'ఎంత చక్కని పేరు!' అని మురిసి పోయింది.

భోంచేస్తూ గుమ్మంమీద కూర్చున మనవణ్ణి చూసి 'ఏంచదువుతున్నాడు?' అన్నాడు స్వరూప్ మామ్మగారితో.

ఇహ ఆవిడ అందుకుంది: చదువూ లేదు సంధ్యాలేదు. అయిదో క్లాసు ఆరు సార్లు తప్పేడు. పోనీ మాఇంట్లో ఉన్నదే గదా అని స్మార్తం చెప్పిద్దాం అనుకుంటే అదీ సరిగా ఏడవడంలేదు. వొట్టి పింజారి వెధవయిపోయేడు. వీడి కొక్కడికే చచ్చేడా తండ్రి లోకంమీద? మీకూ చచ్చేరు! మరి మీరిలాగే అయిపోయేరా!'

ఆ మాటల్లోని మృదుత్వానికి ముక్కుమీద వేలు (మనసులో) వేసుకున్నాడు స్వరూప్.

'ఏదో చిన్నతనం లెండి.'

'నా శార్ధం చిన్నతనం! పద్నాలు గేళ్లు ముడ్డికింద పెట్టుకుని! కానీండి బొడ్డాకులు నాకి పోతాడు!'

ఇంతలో గదిలోంచి కిలకిల నవ్వు వినిపించింది:

'బొడ్డాకులూ నాకక్కర్లేదు, ఏం అక్కర్లేదు, హాయిగా తమలపాకులు వేసుకుంటూ కూర్చుంటాడు చూస్తూండమ్మమ్మా.'

ఈ మాటలు సూర్యోదయంలా అహ్లాదాన్ని నింపేయి.

'మనవరాలు నాయనా, అక్కర్లేని ఆడగుంటకి అబ్బేయి తెలివి తేటలూ నాలుగు ముక్కలూనూ. ఇవంటే వాళ్ళ నాన్న పడి చచ్చేవాడు, చచ్చేదాకా.'

అదేం వినడంలేదు ఆనందస్వరూపునికి. ఆ యువతి నవ్వులోని తీపి మాటల్లోని చురుకుదనం మిక్స్చర్ చేసుకుతింటున్నాడు.

గదిలో జంబుకానా పరుచుకు పడుకున్నాడు నేల తేమగా ఉంటే. ముసలావిడ మాట్లాడిన తేట తెలుగులోని సొగసుల గురించి ఆలోచించుకుంటున్నాడు. చదువు కోని ఆడవాళ్ళదగ్గరే బతికుంటుంది భాష. తన తల్లి చదువుకోలేదు. ఎన్ని తియ్యని పలుకులు పోగొట్టుకున్నాడో తను!

మర్నాడు తెల్లారకుండానే దర్శనమిచ్చింది మామ్మగారు ఓసిలవరు గిన్నె గ్లాసుతో.

'బాబూ, ఈ గ్లాసెడు పాలఖా. దీనెడు మజ్జిగ అర్ధణా. మీకు తెల్లారేసరికి పోసే వాళ్ళని చూసి పెడతాను-మనపక్కనే....'

'అలాగే చెయ్యండి మామ్మ గారూ. నూతికి దారెలా?' అంటూ తువ్వాలు భుజం మీద వేసుకున్నాడు స్వరూప్.

'రండి చూపిస్తాను. ఈ ఊళ్ళో ఏ కొంపలో వెతికినా ఉప్పు నీళ్ళనూతులే. కావిడికి బేడచొప్పున తగలేసి మంచినీళ్ళు తెప్పించుకు ఏడుస్తున్నాం.'

'నాకు ఓ కావిడి నీళ్లు పోయించి పెట్టండి మామ్మగారూ' అన్నాడు స్వరూప్.

"మీకావిడక్కర్లేదు. ఓ బిందెచాలు. నేనో బిందె పోయించుకుంటాను పదణాలు చెబుతోంది. అర్ధరూపాయికి బేరమాడి మీకో కుండ తెప్పిస్తానుండండి.'

"అలాగే లెండి...." అన్నాడతను పరధ్యానంగా. అప్పుడే అతని చూపులు పూలు నిండిన మొక్కలమీద పరిగెడుతున్నాయి. ఆ మూల జామిచెట్టుమీద ఓకాలు ఆడిస్తూ కూర్చుని పళ్లు తోముకుంటున్న అనంత లక్ష్మిమీద వాలేయి.

"ఎంత చక్కగా ఉందండీ పెరడు!" అంటూ గిలక మీదుగా బాల్చి విడిచేసా.

ఉలికిపడి ఉరికింది ఉవిద. సూర్యోదయపు మొహమల్ కాంతిలో మెరుస్తోందామె.

"మీరదృష్టవంతులు! ఇలా సూర్యోదయం చూస్తూ స్నానం చెయ్యడం అంటే నా కెంత సరదా అనుకున్నారు!"

అరమోడ్పు కన్నులతో బిగుసుకున్న పెదవులతో అనంతలక్ష్మి.

నీళ్ల తొడి గట్టుమీద పెట్టుకున్నాడు స్వరూప్. జామిచెట్టుమీద పిట్ట వాలింది. "అదిగో పాలపిట్ట! ఏమి రంగులు, అని అరిచేడు.

లత తిప్పి చూసింది అనంతలక్ష్మి.

ఈ లోపున తన పచ్చని మెడ కింద నునుపుని ఆ యన కళ్ళు తడుముతున్నట్టయింది, సిగ్గుపడింది.

"మీరేం చదువుకున్నారు?"

"ఎక్కువ లేదు లెండి...." అంది చిరుకోపంతో.

"అక్కర్లేదండీ, ఈ చదువులంటే నాకు సదభిప్రాయం లేదు. ఆకాశం, గాలీ, ఆరోగ్యం నించిమన్ని దూరం చేసే చదువులు!"

అనంత లక్ష్మి నవ్వింది: "నా కోసం అజ్ఞానాన్ని గొప్ప చెయ్యాలని తంటాలు పడకండి. ఏదో నేనూ స్కూలు ఫైనలు పాసయాను. సంస్కృత సాహిత్యం చదువుకున్నాను మా నాన్నగారి దగ్గర."

ఇందులో స్వోత్కర్ష లేదు. చనిపోయిన తండ్రి గొప్పదనం తెలీడానికే అలా అందని స్వరూప్ గ్రహించేడు. జాలి కలిగింది ఆమె మీద.

(తరువాయి 25 వ పేజీలో)

## హృదయం మరచిపోయిన రచయిత

(8 వ పేజీ తరువాయి)

"సాహిత్యంలో అందాలు చూపించగల తండ్రి పోవడం నిజంగా తీరని లోటు" అన్నాడు బరువుగా.

తనపట్ల సానుభూతితో అన్నా స్వరూప్ అతని తండ్రిని కూడా తలుచుకుంటున్నాడని గ్రహించింది అనంతలక్ష్మి. ఆమె హృదయం ద్రవించింది.

"మరి తల్లి కూడా పోయిన వాళ్ల మాటో?" అంది.

కాని ఆమె అనుకున్నట్టు అతని మొహంలో విచారం కనబడలేదు.

"వెయ్యిమంది స్త్రీల మంచితనంలో తల్లి ప్రేమని వెతుక్కుంటూ ప్రయాణిస్తున్నాను. ఇవాళ మీ అమ్మమ్మగారే చూడండి నాక్కావలసినవన్నీ స్వయంగా తెలుసుకుని అమరుస్తున్నారు."

అనంత లక్ష్మి మొహంలో రంగులు మారిపోయాయి. డబ్బులకోసం ముసలమ్మ తనకి పాలు అమ్ముతోందనీ, నీళ్లు మోస్తోందనీ ఇతనికి తెలీదా? అంతా నటన! తనని హేళన చేస్తున్నాడు.

పండుంపుల్ల విసిరికొట్టి విస విస లోపలికి పోయింది అనంత లక్ష్మి

ఆమె సిగ్గూ, దుఃఖం కోపంగా అమ్మమ్మ మీద విరుచుకు పడ్డాయి.

పెరట్లో నీళ్లుపోసుకుంటున్నట్టూ, ఖంగు ఖంగుమని దగ్గుతున్నట్టూ, కాండ్రించి కఫం ఉమ్ముతున్నట్టూ కాస్సేపు చప్పుళ్లయ్యాయి.

తర్వాత ఓ గంట గదిలో ఉన్నాడు. తాళం వేసుకుపోతే మళ్ళీ ఏ రాత్రికో రావటం. ఎక్కడా అలికిడే లేదు.

ఇలా రెండు మూడు రోజులు చూసి అమ్మమ్మా, మనమాలూ ఇద్దరూ బుగ్గలు నొక్కుకున్నారు.

"ఆయనేమేనా వొండుకు తింటున్నాడంటావా అమ్మమ్మా?"

"నీ మొహం నా నెత్తీనూ! గరిటి చప్పుడేనా లేందే!"

ఇలా కొంతసేపు మాట్లాడుకున్న తర్వాత అతనేం వొండుకు తినడంలేదనీ తామేదో కూరానారా ఇవ్వాలనీ తీర్మానించుకున్నారు వాళ్ళిద్దరూ. ఆ అమ్మమ్మా మనవరాలూ ఏకాభిప్రాయానికి రావడం ఇతని విషయంలోనే జరిగింది.

ఆ సాయంత్రం ఓ సంస్కృత పత్రిక సంచికతో తయారయేడు ఆనందస్వరూప్. 'కొన్ని మంచి రచనలుంటాయని మీకోసం కాకినాడ నుంచి పట్టుకొచ్చేను....?' అన్నాడు దాన్ని అనంత లక్ష్మి కిస్తూ.

పొంగిపోయింది అనంత లక్ష్మి. ఆ పత్రిక చూసి కాదు; తనపట్ల అతని శ్రద్ధ చూసి "మీకూ సంస్కృతం వొచ్చునా?"

"రాదండీ నాకు భాషలపై శ్రమించే ఓపిక తక్కువనుకుంటాను."

"కవులా?" అంది అతని సోమరి వాలకం చూసి పెదవులవెనక నవ్వుకుంటూ.

"గీతాలు రాసుకుంటూ ఉంటాను. బొమ్మలు కూడా వేస్తూ ఉంటాను. ఎన్ని చేసినా నేను ఏదీ కాను. సౌందర్యాన్ని చూసినపుడు ఆనందించ గలగడంకోసమే ఈ విద్యలన్నీ."

అతన్ని అర్ధచేసుకునేందుకు ఆలోచించవలసి వస్తోంది అనంత లక్ష్మికి.

తనని ఎవరయినా స్టడీ చెయ్యడం అంటే స్వరూప్‌కి తగని భయం. అందుకే వాళ్ళకలాటి అవకాశం ఇవ్వకుండా వాళ్ల దృష్టిని మళ్ళించడానికి శతవిధాల ప్రయత్నిస్తూ ఉంటాడు.

"ఆఁ నా గీతాలు చూపించమన్నారా?" అంటూ తన గదిలోకివెళ్ళి ఓ పుస్తకం పట్టుకొచ్చేడు.

ఇద్దరూ చెరో కుర్చీలో కూర్చున్నారు.

కొన్ని గీతాలు చదివేడు ఆనంద స్వరూప్.

తియ్యని కంఠం చక్కని భావాలు! ఆ గీతాలు అనంతలక్ష్మి హృదయతంత్రుల్ని మీటితే అవి జాలిగా పలికేయి.

"ప్రేయసి కన్ను" అన్న గీతం విని నిట్టూర్చి ఇలా అంది. "నిజంగా ప్రేయసి కళ్లని ఎట్ట ఎదుట చూసేవాడు, ఎక్కడో కొండలూ వాటిపై ఎండలూ నీడలూ లాటి ప్రకృతి దృశ్యాలని తలుచుకోవలసిన ఖర్మేమిం? మీరు సౌందర్యాన్నేగాని ప్రేయసిని ఎరగరు?"

కొంచెం ఆశ్చర్యపడ్డాడు ఆనంద స్వరూప్. అయినా చప్పనే అన్నాడు! "నిజమేనండి. ప్రేమ గురించి ఇంకా మనం స్టడీ చెయ్యవలసింది."

బల్లపై చేత్తో కొడుతూ నవ్వింది అనంత లక్ష్మి. గాజుల సవ్వడి ఆమె నవ్వులో కలిసి సార్థకత చెందింది.

"స్టడీ చెయ్యడం కావలసింది. అనుభవం!"

"అదీ నిజమేనండి, అనుభవాన్ని పెంచుకుంటూ ఉండాలి. అలా చెయ్యలేక పోబట్టే మన కవులు చాలా మంది ముప్పయిదాటక మూలబడిపోతున్నారు" ఇలా అతను సంభాషణని తననించి తప్పించేశాడు.

"ప్రాచీన సాహిత్యంలో ఏముంది? మూసలో పోసి తీసిన సరుకు!"

"ఆ నిగమ శర్మ పాత్ర ఒక్కటి చాలు మనం ఎన్ని శతాబ్దాలయినా గర్వపడ్డానికి?"

"ఇహ మన ఆధునిక సాహిత్యం చూడండి ఎంత గొప్పగా...."

"పాతని పడగొట్టేరు మన రచయితలు. మరి వీళ్లు ఏ పునాదులపై నిర్మిస్తున్నారు? ఓ వైపు ఫ్రాయిడ్ ఇంకో వైపు మార్క్స్!"

అతను సాహితీ సముద్రాన్ని ఔపోసన పట్టేసిన అగస్త్యుడిలా కనిపించేడు అనంత లక్ష్మికి. అయితే ప్రాచీన సాహిత్యంపై ఆమెకున్న విశ్వాసాన్ని వేళ్లతో కదిలించసాగాయి అతని అభిప్రాయాలు.

కొంతసేపయేక వొండుకుందుకు అతను లోపలికి వెళ్ళిపోయేడు.

ఎదిగిన ఆడపిల్ల చెట్టంత మొగాడితో సమానంగా కూర్చుని మాట్లాడం అంత సిగ్గుమాలిన పనికి అనంతలక్ష్మిని అమ్మమ్మగారు ఓ ఉపన్యాసం చీవాట్లు పెట్టింది.

స్వరూప్ దినచర్య గమనించసాగింది అనంతలక్ష్మి.

కుంపటిమీద బియ్యంపడేసి ఏదో చదువుకుంటూనో బొమ్మగీసుకుంటూనో ఉంటాడు. తరచు ఊరికే అలా పడుకుంటాడు.

తాళం వేసుకుపోతే మళ్ళీ ఏ రాత్రికో రావడం.

ఉద్యోగరీత్యా అనేక ఊళ్లు తిరుగుతూ ఉంటాడు. ఆ డ్యూటీ టైములోనే తన కళాభిరుచుల్ని ఏదో రీతిని తృప్తిపరుచుకుంటాడు. జానపద గేయాల్ని పాడించుకుంటునో, పల్లెపడుచుల అందాల్ని పరిశీలిస్తూనో.... ఇంటిదగ్గర అతనెక్కువగా రాసినట్టూ చదివినట్టూ కనబడడు. ఏ అర్ధరాత్రిప్పుడో కూర్చుని రాసేస్తాడు ఓ వ్యాసమో కథో.

అతను చాలామంది చిత్రకారుల్ని వాళ్ల ఇళ్లదగ్గరే కలుసుకుని వాళ్ళకృషి చూస్తూంటాడు. వాళ్ళమీద వ్యాసాలు రాస్తూంటాడు. పేరుకోసం కాదు. తను చూసిన సౌందర్యాన్ని హృదంలో పదిలపరుచుకునేందుకు అతను అవలంబించే ఒక మార్గం. ఒకనాటి రాత్రి మోటారు సైకిలుమీద అనంతలక్ష్మి పినతల్లి కొడుకొకతను వొచ్చేడు. అతను డాక్టరు.

తన గదిలో స్వరూప్ ఖంగు ఖంగుమని ఒకటే దగ్గు.

"ఎవరమ్మమ్మా ఆ గదిలో?" అన్నాడు ఫోం చేస్తూ.

"ఏదో ఇన్‌స్పెక్టరట" అద్దెకుంటున్నాడు. మనకి కావలసినవాడు.

"మాకు కావలసినవాడు?"

"అదేవిఁటి నువ్వతన్ని ఎరుగుదువా ఏవిఁటి?"

నవ్వేడు డాక్టరు "అతను డాక్టర్లకి కావలసినవాడమ్మమ్మా. ఆ దగ్గు వింటేనే తెలుస్తోంది. ఎందుకి దింపెవు అతన్ని."

"అదేమో నాకేం తెలుసురా నాయనా? ఏదో-"

సావిట్లోంచి ఈ మాటలు విన్న అనంతలక్ష్మి గుండెలు జారేయి.

పొద్దున్నే నూతి దగ్గర స్వరూప్‌తో అంది. "రాత్రి మోటారు సైకిలు గదూ ఆబ్బా, దానిమీద కాలవగట్లంట హై స్పీడులో వెళ్లాలని ఎన్నాళ్లబట్టో కోరిక!" అన్నాడు అతిఉత్సాహంగా.

ఇహ అప్పటికతనితో ఏం చెప్పాలని లేకపోయింది అనంతలక్ష్మికి. దిగులుగా తలొంచుకుని తన గదిలోకి వొచ్చేసింది.

కుర్రాడికి కూరా అదీఇద్దాం అనుకున్న వెంకమ్మగారు మనసు మార్చుకుంది.

ఆ పగలంతా మతిపోయినదానిలా కూచుంది అనంతలక్ష్మి. రాత్రి రాగానే స్వరూప్‌తో మాట్లాడుదాం అనుకుంది.

కాని ఆ రాత్రికతను రాలేదు. మర్నాడొచ్చాడు. కొన్ని చిత్రాల ప్రింటులూ, కొంత నోట్సు తోటి ఆ రాత్రి నెమ్మదిగా అతని గదిలో ప్రవేశించింది. దీపం ముందు కూర్చున్నాడతను. "ఏం చేస్తున్నారు?"

"ఓరండి! రాజమండ్రి వెళ్లానుగదూ. ఆ చిత్రకారుని జీవితం రాస్తున్నాను రండి ఇలా కూర్చోండి."

"ముందు మీ జీవితం చూసుకోండి. చాలు. ఆఁ మీ కళ్ళేం అంత ఎర్రగా ఉన్నాయి?" అంది జంబుకా నా మీద కూర్చుంటూ

"బహుశా కల్లు తాగడాన్నేమో?

"కల్లా???" అంటూ అనంత లక్ష్మి నిర్ఘాంతపోయింది.

"ఊఁ ఇవాళ ఓ గ్రామస్థులు రుచి చూపించేరు. మొదట్లో అదో రకం కల్లు తాగితే తలమీద మొత్తినట్టయి పడిపోయేను. తర్వాత తీపి కల్లిచ్చేరు. నాకు ఎన్ని ఉపచారాలూ చేసూ ఎన్ని కబుర్లు చెప్పేరనీ వాళ్లు! అన్నట్టు నాకు బదిలీ అయింది. మిమ్మల్ని వొదిలి వెళ్ళిపోవడం అంటే ఎంతో దిగులుగా ఉంటుంది. కాని ఏం చేస్తాను? నా జీవితం అంతా స్నేహితులతో ఎడబాటూ, కొత్త స్నేహాలూను...."

అనంతలక్ష్మి మర్యాదకి ఏవో మాట్లాడి బొమ్మలా నడిచివొచ్చి తన గదిలో మంచంమీద పడిపోయింది అతను వెళ్ళేదని రూఢి అయేక తిరిగివొచ్చింది.

"ఏవేఁ ఎక్కడికి వెళ్ళావే? పాపం మంచివాడు వెళ్ళిపోయేడు. ఈ నెల్లో పదిహేను రోజులయినా ఉండకపోయినా నెల అద్దె ఇచ్చేసి మరీ వెళ్ళేడు. అలా వుండాలి! అలా నిలబడి గంటా గంటన్నర సేపు మాట్లాడేడు. ఎంతకీ నన్ను వొదలండే. "అనంతలక్ష్మిగారిని అడిగానని చెబుతారు కదూ" అని బాదస్తంగా పది మాట్లు చెప్పేడు. ఎందుకూ? ఇదివరకు ఇంతమంది ఉండివెళ్ళేరు....?" అని వెంకమ్మగారు చదివేస్తోంది.

అనంతలక్ష్మి అతను వొదిలిన గదిలోకి వెళ్ళింది. బూపురు మంటోంది. అలమర ఓమూల కాగితాలున్నాయి తీసింది. రాజమండ్రి చిత్రకారుడి జీవితం, మరచిపోయేడు. చదివింది. ఆ చిత్రకారుడి గుణాల్ని ఎంతగానో మెచ్చుకున్నాడు.

తన గదిలోకిపోయి తలుపు వేసుకుంది.

సున్నితమైన హృదయం,

మంచినే గ్రహించి మననం చేసుకునే తత్వం,

— ఇవీ స్వరూప్‌లో గుణాలు.

ఎన్నో గంటలుగా తొందర పడుతున్న కన్నీళ్ళు అవకతం చిక్కగానే కట్టలు తెంచుకున్నాయి.

ఒక వ్యక్తి ప్రభావానికి లోనవడం ఎలాటిదో అది అనుభవించిన వాళ్ళకే తెలుస్తుంది. మేలుకున్నప్పుడు అనంతలక్ష్మి సర్వస్వాన్నీ, సుషుప్త్యవస్థలో ఆమె స్వప్నాలనీ ఆక్రమించుకున్నాడు స్వరూప్. ఏపని చేస్తున్నా ఈ సందర్భంలో స్వరూప్ 'ఇలా అంటాడు' 'ఇలా చేస్తాడు' అనుకుంటోంది అనంతలక్ష్మి.

ఆది మార్గశిరమాసం. స్వరూప్ వెళ్ళిపోయి ఎన్నోయుగాలైనట్టుంది. అమ్మమ్మ హరికథకి వెళ్ళింది. అనంతలక్ష్మి ఒక్కర్తీ పడుకుని కిటికీలోంచి చూస్తోంది చంద్రుడు కూడా మబ్బుల రగ్గుల్నిలాక్కుంటున్నాడు.

నిగమ శర్మ పాత్ర నచ్చడం. మోటారు సైకిలుమీద వెర్రి స్పీడ్‌లో వెళ్ళాలనుకోవటం - ఇలాటివి స్వరూప్ స్వభావానికి వ్యాఖ్యానం. లోతుగా జీవించాలనుకుంటాడు. ఆలోచనలో. జీవితంలో ప్రతి పనిలోనూ, స్పీడ్ ఇష్టపడతాడు. మృత్యు భీతి ఎక్కువ స్వరూప్‌కి.

బలవంతాన కళ్ళు మూసుకుంది అనంతలక్ష్మి.

క్రమేపీ నిద్రపట్టింది. ఆ నిద్రలో కల.

స్వరూప్ జబ్బుతో ఓ మంచం మీద తెల్లని దుప్పట్లలో ముసిగిపడుకున్నాడు. తను దుప్పట్లు మార్చి కాళ్ళొత్తి పరిచర్య చేస్తోంది అతనికి.

"ఈ సేవ నీ వ్యక్తిత్వాన్ని చంపి నా సోమరితనాన్ని పెంచుతుంది అనంతం!"

అతని పెదవులు కదలడం చూసింది కాని తనీమాటలు వినలేదు. అయితే స్పష్టంగా విన్నట్టే అనిపించింది కల్లో అనంతానికి.

తను అంది 'పోనీండి అది మీకు ఆరోగ్యాన్నీ నాకు ఆనందాన్నీ ఇస్తుంది. అదిచాలు.'

అతను మౌనంగా ఉండిపోయేడు.

తనే చెప్పసాగింది. "పుట్టిన ప్రవాహాలన్నీ వెడల్పవుతూ సముద్రాన్ని చేరడానికే చూడవు! ఏ పెద్ద నదిలోనో తమ జలాల్ని కలిపేసుకుంటాయి. అంతే వ్యక్తిత్వం విషయం కూడ. అందరూ తమ వ్యక్తిత్వాన్ని వృద్ధి చేసుకోవాలనుకోరు. తాము ఆరాధించే ఏ వ్యక్తి సేవలోనో దాన్ని అర్పించేసుకుంటారు. మన దేశపు స్త్రీల విషయంలో ఇది అక్షరాలా నిజం!"

"నా ఆరోగ్యం బాగుంది" అంటూ గబుక్కున లేచేడు స్వరూప్.

"లేవకండి" అంటూ అతని చేతిని గట్టిగా పట్టుకుంది తనూ టంగ్.... టంగ్ ... టంగ్ గడియారం గంటలు కొడుతోంది "మామ్మాగారూ, తలుపు!" వీధి తలుపు చప్పుడవుతోంది అనంతలక్ష్మి కళ్లు విప్పింది. తన చేతులు మంచం పట్టుకుని ఉన్నాయి.

టంగ్.. టంగ్... పన్నెండు కొట్టి ఊరుకుంది.

"తలుపు, మామ్మగారూ, తలుపు!" స్వరూప్

భయంతో బిగుసుకుపోయింది అనంతలక్ష్మి.

కలా? నిజమా? ఏది కల? ఏది నిజం? తలుపు చప్పుడవుతూనే ఉంది. అతను పిలుస్తూనే ఉన్నాడు.

అమ్మమ్మలేదు. తలుపు తియ్యొచ్చునా? కల్లు తాగ గలిగే మనిషి! ఆ తాగడంలో అతనికి దురుద్దేశం లేకపోవచ్చు. కేవలం కొత్త అనుభవం మీద ప్రేమ. కాని తన్ని బలవంతపెట్టి ఆ అనుభవం ఎలా ఉంటుందో చూడగోరితే అతను...?

నవ్వుకుంది అనంతలక్ష్మి. తన పసిపాప స్వరూప్.

నిద్రలో నడిచే మనిషిలా వెళ్ళి తలుపు తీసింది.

లోపలికొచ్చేడు స్వరూప్ సైకిలుతో బాటు. సైకిలుని సావిట్లో నిలబెట్టి, అక్కడున్న దీపం హెచ్చించేడు. "అదేమిటి మీ మొహం అలా వెల వెల బోతోంది? భయపడ్డారా? అమ్మమ్మగారేరీ?"

కొంచెం సర్దుకుని తలుపు దగ్గరగా వేసింది అనంతలక్ష్మి. "హరికథకెళ్ళింది."

"ఇలాటి చలిలోనా? అబ్బ! ఎంత ఓపికండీ ఆవిడకి!"

కసురుకుంది అనంతం "మీ రొక్కసారి ఇతర్లని పొగడ్డం కట్టిపెడతారా? ఇలాటి చలిలో సైలు ప్రయాణం చేసినది చాలక పుట్టి మునిగిపోయినట్టు సైకిలు మీద ఎందుకొచ్చేరిక్కడికి?"

అతనేదో చెప్పబోతే దగ్గుచుట్టబెట్టేసింది.

చప్పున తన శాలువా తెచ్చి అతనిమీద కప్పింది "ఇలా వొచ్చి నా మంచంమీద కూర్చోండి" అని వంటింట్లోకి వెళ్ళిపోయింది.

అయిదు నిముషాల్లో కణకణలాడే కుంపటీ నిప్పులతో తిరిగి వొచ్చింది. దానిమీద నీళ్ళు పడేసింది. కుంపటి మంచం దగ్గరపెట్టింది.

కాళ్లు కాచుకోసాగేడు స్వరూప్ ఇంకా కొంచెం దగ్గుతూ.

అనంతలక్ష్మికి గగుర్పాటు కలుగుతోంది స్వరూప్ ఇంత శ్రమపడి తన్ని చూడడానికే వచ్చాడు!

మూత చప్పుడవుతోంది. అతను కిందికిదిగి కుంపటి దగ్గర కూర్చున్నాడు. నిప్పుల ఎర్రని వెలుగులో ఆవిరి గులాబీ పువ్వుల్లా సుళ్లు తిరుగుతూ అతన్ని అలుముకుంటోంది.

'ఎందుకొచ్చేరు చెప్పండి ఇంత రాత్రప్పుడు!?' అంది అనంతలక్ష్మి సానుభూతి పూర్వకంగా.

'ఒక చిత్రకారుడి జీవితం ఇక్కడ మరచిపోయేను....' అని ఏమో చెప్పబోయేడు స్వరూప్.

'ఓ కార్డు ముక్కమీద మీ ఎడ్రెసు రాసిపడేలేకపోయేరా? పోస్టు బాక్సులో పారేద్దునే!' అంది.

ఆమె కోపం కోపంగా గుర్తించ వీల్లేనట్టుంది - అంత దుఃఖం దానిలో:

నెమ్మదిగా నవ్వుతూ అన్నాడు స్వరూప్: 'ఒక రచయిత హృదయంకూడా ఇక్కడే మరచిపోయేను, అనంతలక్ష్మి. దాన్నెక్కడ పారేస్తారు?'.

గంభీరురాలైంది అనంతలక్ష్మి.

'నీళ్లుడికి పోతున్నాయి. పొడుం వెయ్యరూ?' అన్నాడు.

తలొంచుకుని టీగుండ నీళ్ళలోవేస్తోంది.

ఆమె చెయ్యి పట్టుకున్నాడు స్వరూప్ గిన్నె మీదుగా.

'అబ్బబ్బ ఆవిరి చేతిమీదికి వొస్తోంది, వొదలండి!'

వొదిలేడు. 'ఒక్క క్షణానికే మీ కిలా ఉంటే రోజూ చేతులు కాల్చుకుంటున్నాను నాకెలా ఉండాలి అనంతలక్ష్మీ?

ఆడపిల్లల వివాహ సందర్భాలపట్ల ప్రభుత్వం శ్రద్ధ చూపిస్తోంది. పిల్లల విద్యా ఉద్యోగావకాశాలు పెంచడం ద్వారానూ, మాలాటి త్వరగా పెళ్ళిచేసుకోం అనే - కుర్రాళ్లని హోటలయినా లేని ఊళ్లలో పడెయ్యడం ద్వారానూ- వొంట దగ్గర్నుంచి జీవితంలో అన్నిటా మీ తోడ్పాటు కావాలి నాకు.

అనంతలక్ష్మి మౌనంగా టీ కలిపి అతనికి గ్లాసు అందించింది.

"ఆడది కావలసినప్పుడల్లా ఆమె ముందు నిస్సహాయుడిలా నటించడం ప్రతి మొగాడికీ అలవాటు. మీ కెవ్వరి సాయం అక్కర్లేదు. నా సాయం అసలే అక్కర్లేదు అంది అనంతలక్ష్మి.

టీ కొద్ది కొద్దిగా తాగుతూ "అది సరి కాదు అనంతలక్ష్మీ; మీరు తోడుంటే నేను ఎంత బాగుపడతానో మీకు మాత్రం తెలీదా ? ఊరికే నన్ను పరీక్షిస్తున్నారుగాని' అన్నాడు స్వరూప్.

"చాల్లెండి ఎక్కువ తాగితే వేడిచేసి నిద్ర పట్టదు ? అంటూ అతని చేతిలోని గ్లాసు లాక్కుంది అనంతలక్ష్మి. తను ఖాళీ చేసింది.

లలితానంద స్వరూప్ మారు మాటాడకుండా మంచం ఎక్కి శాలువా లాక్కుని పడుకున్నాడు.

అనంతలక్ష్మి కుంపటీ గిన్నెలూ వొంటింట్లో పడేసి వొచ్చింది.

వెన్నెట్లో హాయిగా నిద్రపోతున్న స్వరూప్ మొహం ఎంత అందంగా ప్రశాంతంగా ఉంది !

"అప్పుడే ఇంత గాఢ నిద్ర !

జాలిగా అతని పక్కన కూర్చుని గుండెలు నెమ్మదిగా రాయసాగింది అనంతలక్ష్మి.

ఇంక స్వరూప్ దగ్గడు, దగ్గకూడదు. ఆ మాట కాస్త గట్టిగా తుమ్మకూడదు!

"దీనమ్మ కడుపుమాడ ! దారిలో ఈ సైకిలేవిఁటే అడ్డుగా ? సావిట్లో పెద్దగా అమ్మమ్మ గొంతు.

అనంతలక్ష్మి పరిగెట్టింది.

"దీంతగవెయ్యా ! గుండెల మీదే పడింది తియ్యవే తల్లీ."

అనంతలక్ష్మి నవ్వుతూ హేండిలూ సీటూ పట్టుకుని సైకిలుని ఎత్తుతూ "సైకిలా నల్లపూసా ? కాస్త చూసుకురారూ అమ్మమ్మా ? పోన్లే ఇవాళ నుంచీ నీ గుండెలమీది పెద్ద బరువొహటి దిగిపోయింది...." అంది.

---

## గాంధీజీ పొదుపు విధానాలు

( 15 వ పేజీ తరవాయి )

పెద్దమనిషి గ్లాసులో నీరు క్రింద పారబోశాడు. అది చూచి గాంధీజీ మిగుల చింతించారు. గ్లాసెడు నీళ్ల క్రింద ఒలకబోసి వృధా కావించారు ! ఆ నీరు త్రాగుటకు పనికిరాని మాట వాస్తవమే అయినా, ఆ నీటితో తన తలమీది తువ్వాలు తడుపుకొనుటకు వీలయ్యేది.

భారతదేశం మిక్కిలి పెద్దదేశమని గాంధీజీకి బాగా తెలుసు. అందుచేత ఆయన తన దేశస్థులంతా ఒక పాఠం నేర్చుకోవాలని అభిప్రాయపడ్డారు. అది యేమనగా "ఒక ముద్ద అన్నముగాని, ఒక చుక్క నీరు గాని వృధాచేయకూడదు.

(ఆంగ్లానువాదం)

---

## అగమ్యం

(20 వ పేజీ తరువాయి)

కాగితం ఉంది. తీసి చూసేను. "మామయ్యా, కొందరి జీవితాలు వడ్డించిన విస్తరిలా ఉంటే, మరి కొందరివి గాలికి కొట్టుకుపోయే ఎంగిలాకులా ఉంటాయి నా జీవితం ఈ కోవకు చెందినది. తల్లి లేదు. తండ్రి ఉన్నా లేనికిందే లెక్క జీవింలో గమ్యం అంతకన్నా లేదు. నా జీవితంలో ఆదరించింది నువ్వే. నీ కెప్పుడూ ఋణపడే ఉంటాను. ఈ ఉత్తరం ఇప్పుడు రాసినా తలకింద పెట్టుకుంటున్నా నా అంతం దగ్గరే ఉందని నాకు తెలుసు. ఇది నీకు చేరుతే అంతే చాలు. రాధ" నా కన్నీటిబొట్లు రాధ అగమ్య జీవితానికి తార్కాణంగా నిల్చేయి.

---

## అసలు ఏం జరిగింది

(14 వ పేజీ తరువాయి)

పాపం రావు ఎంత బాధపడిపోతున్నాడో చూడవే రంగమ్మ అక్కయ్యా. ఉదయం సాయంత్రం వంట చేసుకొని ఆఫీసుకు వెళ్ళడం పాపం." అంటూ మొదలు పెట్టింది రామమ్మగారు నీలాటి రేవు వద్ద.

ఎంత గడ్డుకాలం కాకపోతే అప్పుడే 4 నెలలు అయింది, దాని అకరు పికరూ లేదు. ఇంతవరకు అంటూ చెప్పుకుపోతోంది రామమ్మగారు.

ఇంతలోకి వారిదృష్టి అటువస్తున్న బండిమీద పడింది. వెంటనే అందులో ఉన్న స్త్రీ లీలే అని ఇట్టే పోల్చేశారు. అరే లీల మరల తిరిగి వచ్చేసింది అంటే

యోగాశ్రమము
వాల్తేరు

డాక్టర్లకు సాధ్యముగాక వదలి వేయబడిన అన్ని వ్యాధులకు, చికిత్స చేయబడును. కుష్టు బొల్లి, క్షయ పిచ్చి వ్యాధిగ్రస్తులు, సంతానము లేనివారు నపుంసకులు జీవితానందము కొరకు శ్రీ యోగిగారితో సంప్రదించుడు

వివరములు కోరువారు 12 అణాలు పంపిన ఆశ్రమ నివేదిక పంపబడును.